క్లుప్తంగా

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

కలికిరి : పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా వేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ మదనపల్లి ఏడీఏ డా. విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మండలంలోని పత్తేగడ గ్రామం కొటాలలో మంగళవారం ఆయన టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలతో పాడి ఆవులకు పాలు తగ్గుతాయన్న ఆపోహలను రైతులు నమ్మవద్దన్నారు. ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకా వేయించాలని సూచించారు. నాలుగు నుంచి ఎనిమిది నెలలు వయస్సు కలిగిన పేయ దూడలకు బ్రుసెల్లోసిస్ టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు. కలికిరి ప్రాంతీయ పశువైద్యాశాల సహాయ సంచాలకులు డా. వెంకటముని నాయుడు, పశువైద్యాధికారి గిరినాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మదనపల్లె సిటీ : ఆర్టీసీ డిపో పరిధిలో సమస్యలు పరిష్కరించడానికి,సలహాలు, సూచనలకు బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ అమర్‌నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రయాణికులు తమ సమస్యలను 9959225677 నంబర్‌కు తెలియజేయవచ్చన్నారు.

మహిళా డిగ్రీ కాలేజీలో అకడమిక్ ఆడిట్


రికార్డులు పరిశీలిస్తున్న అకడమిక్ అడ్వైజర్స్

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మంగళవారం అకడమిక్ ఆడిట్ నిర్వహించారు. బీటీ కాలేజీ అధ్యాపకురాలు శ్రీదేవి, పీలేరు డిగ్రీ కాలేజీ అధ్యాపకురాలు శ్రీనివాసులు రెడ్డి అకడమిక్ అడ్వైజర్స్‌గా వ్యవహరించారు. కాలేజీలోని అన్ని విభాగాలలోని రికార్డులను పరిశీలించి గ్రేడింగ్ ఇచ్చారు. కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాకులు విష్ణుప్రియ, మోహన్‌వల్లి, వనజ, మోహన్‌బాబు, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణకు దరఖాస్తులు

బి.కొత్తకోట : వివిధ కార్పోరేషన్ల ద్వారా మండలంలో అర్హత కలిగిన మహిళలు కుట్టు శిక్షణ పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ దిలిపికుమార్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ వర్గాలకు చెందిన 18 నుంచి 50 ఏళ్ల వయసు కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణ 45 రోజులు, 60 రోజులు, 90 రోజులు ఉంటుందని ఇందులో ఏ శిక్షణ కాలానికైనా అభ్యర్థులు ఎంపిక చేసుకోవచ్చని కోరారు.

సింహవాహనంపై గట్టు వెంకటేశ్వర స్వామి


సింహవాహనంపై స్వామివారి ఊరేగింపు

రామసముద్రం : మండలంలోని చెంబకూరులో వెలసిన శ్రీ గట్టు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారు సింహవాహనంపై వైభవంగా ఊరేగారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మాజీ ఎమ్మెల్యే సంతాపం


నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం పట్టణం బజారు వీధికి చెందిన స్టాంపుల క్రిష్ణమూర్తి భార్య వెంకటరత్నమ్మ మరణించిన సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వారి ఇంటికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మండలంలోని ఓబులంపల్లికి కె.భాస్కర్‌రెడ్డి(87) మృతి సమాచారం తెలుసుకుని వారికి ఇంటికి వెళ్లి ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు.

పరామర్శ :
గుర్రంకొండ : మండలంలోని టి.రాచపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మొర్రంరెడ్డి నాగిరెడ్డి మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సంతాపం ప్రకటించారు. నాగిరెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతోబాధపడుతూ గత రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే మంగళవారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కమనీయం.. శ్రీ లక్ష్మీనరసింహుడి కల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు


గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు

- గరుడ వాహనంపై ఊరేగిన స్వామివారు
- ఆకట్టుకున్న కోలాటం, చెక్కభజన
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవం కనులల పండుగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వేకువ జామునే మూలవర్లకు అభిషేకం, తోమాలసేవ, అనంతరం తిరుచ్చిలో స్వామివారిని అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ మండపంలో మూలవర్లకు స్నపన తిరుమంజనం చేశారు. అనంతరం కల్యాణోత్సవం కోసం ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లి వేదికను అందంగా అందంగా అలంకరించారు. ముందుగా స్వామివార్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అలంకరించిన తీరు అందర్నీ ఆకట్టుకొంది. ముత్యాల తలంబ్రాలతో స్వామివారి పెళ్లి వేడుక రంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్య ధారణ చేయించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామి వారి ఎదుట యజ్ఞహోమాలు నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టు వస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం వాహన మండపంలో అందంగా అలంకరించిన గరుడ వాహనంపై ఉత్సవమూర్తులను కొలువుదీరి మేళతాళాలతో కోలాటాలు, చెక్కభజనలతో గ్రామపురవీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఆలయంలో నేడు:
మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథారోహణం, రథాగమనం, ధూళీ ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు గోపాలాబట్టర్ తెలిపారు.

మొండి బకాయిల వసూళ్లకు బ్యాంకర్ల పల్లెబాట


మాట్లాడుతున్న సహకార బ్యాంకు మేనేజర్ శివారెడ్డి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రైతులు పంటల సాగు పెట్టుబడి కోసం రుణాలు పొంది తిరిగి సకాలంలో బ్యాంకులకు చెల్లించకపోవడంతో మొండి బకాయిదారుల ఇళ్ల వద్దకు సొసైటీ బ్యాంకు అధికారులు పల్లెబాట పడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సొసైటీ బ్యాంకులో మొండి బకాయిదారుల నుంచి రూ.2 కోట్లు, దీర్ఘకాలిక రుణాల రైతుల నుంచి రూ.1.23 కోట్లు, స్వల్పకాలిక రుణాలు రూ.80 లక్షల దాకా రుణ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని బ్యాంకర్లు చెబుతున్నారు. కనీసం వడ్డీ చెల్లించి రుణాలను రెన్యువల్‌నైనా చేసుకోవాలని బ్యాంకర్లు రైతులకు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం స్థానిక సొసైటీ బ్యాంకులో డీసీసీ బ్యాంకు మేనేజర్ శివారెడ్డి, సూపర్‌వైజర్ సీ.చంద్రశేఖర్, సీఈఓ కే.చంద్రశేఖర్‌లు రైతులు, బ్యాంకు ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ సాధారణంగా నగదును డిపాజిట్ చేస్తే 7.8 శాతం వడ్డీ ఇస్తారని, అదే అవని పథకం ద్వారా మహిళలకు ప్రత్యేకంగా డిపాజిట్లపై 8.30 శాతం ఇస్తారని పేర్కొన్నారు. మహిళ సీనియర్ సిటిజన్ అయితే 8.40 శాతం వడ్డీ ఇస్తారని, అది కూడా 333 రోజులకేనని తెలిపారు. రైతులు, ఖాతాదారులు తమ బ్యాంకు నుంచి రుణాలను పొంది సకాలంలో చెల్లించి బ్యాంకు అన్ని విధాలా అభివృద్ధి బాటలో పయనించేందుకు సంపూర్ణ సహకారం అందించాలని ఆయన కోరారు.

అగ్నిప్రమాదంలో మామిడితోట దగ్ధం


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన మామిడితోట

తంబళ్లపల్లె : అగ్నిప్రమాదంలో మామడితోట దగ్ధమై సుమారు రూ.4 లక్షల ఆస్తినష్టం జరిగిన సంఘటన మంగళవారం మండలంలో వెలుగు చూసింది. బాధితుని కథనం మేరకు.. కోసువారిపల్లె పంచాయతీ దిగువముత్రవారిపల్లెకు చెందిన రఘునాథరెడ్డి మూడు ఎకరాల్లో మామిడి, అల్లనేరేడు తోట సాగు చేస్తున్నాడు. తోటతో వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నాడు. సోమవారం పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి మామడితోటకు అలుముకున్నాయి. మంటలు ఆర్పేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పూత, పిందె దశలో ఉన్న 30 మామిడి, 30 అల్లనేరేడు, 40 టేకు, వేప చెట్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. అపారనష్టం కలగడంతో రైతు కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారంతో రైతును ఆదుకోవాలని కోరుతున్నారు.

మున్సిపాలిటీకి రూ.4.76 లక్షల ఆదాయం


వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల

మదనపల్లె : పట్టణంలోని దినసరి మాంసం మార్కెట్, జంతువధశాలకు నిర్వహించిన వేలంపాటల్లో రూ.4.76 లక్షల ఆదాయం మున్సిపాలిటీకి లభించినట్లు కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వారపుసంత, దినసరి కూరగాయల మార్కెట్, మటన్‌మార్కెట్, జంతువధశాల, ప్రైవేట్‌బస్టాండ్, టౌన్‌హాల్ లీజుకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించారు. అయితే.. మటన్ మార్కెట్, జంతువధశాలకు తప్ప మిగిలిన వాటికి వేలంపాటల్లో పాల్గొనేందుకు ఎవరూ ఆసక్తి కనపరచలేదు. దీంతో ఆ రెండింటికీ నిర్వహించిన వేలంపాటల్లో మటన్ మార్కెట్‌ను రూ.2,67,500కు, జంతువధశాలను రూ.2,09,000కు పట్టణానికి చెందిన షేక్ సయ్యద్‌బాషా దక్కించుకున్నారు. అనంతరం కమిషనర్ కే.ప్రమీల మీడియాతో మాట్లాడుతూ..మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని దిగువ, మొదటి అంతస్తులోని 52షాపు రూములను మూడేళ్ల కాలపరిమితితో నెలసరి అద్దెపై బాడుగకు ఇచ్చేందుకు ఈనెల 15న మధ్యాహ్నం 3 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు మున్సిపల్ నిబంధనల ప్రకారం డిపాజిట్, అవసరమైన పత్రాలు సమర్పించి వేలంపాటల్లో పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్వో విజయ్‌కుమార్, ఆర్ఐ శ్రీనివాసులు, మున్సిపల్ సిబ్బంది రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'యువత పోరు' విజయవంతం చేయాలి


నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కేంద్రాల్లో బుధవారం తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువకులు, తల్లిదండ్రులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే స్వగృహంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో చర్చించి దిశనిర్దేశం చేశారు. యువత పోరుకు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలన్న అంశాలపై వినతిపత్రం జిల్లా కలెక్టర్‌కు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్, వైస్ ఎంపీపీ కరీమ్, ఎంపీటీసీ మహేష్, నాయకులు ఆర్.క్రిష్ణారెడ్డి, కోటిరెడ్డి, రామమూర్తి,బాలకృష్ణారెడ్డి, జయనారాయణరెడ్డి,కిషోర్‌రెడ్డి, రామశంకరరెడ్డి, రెడ్డప్ప, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభ్యున్నతికి కృషి చేయండి

– ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట : పార్టీ పదవులు పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ అభివృద్ధి కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. పార్టీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా నియమితులైన బీరంగి రేవతి మంగళవారం ఎమ్మెల్యేని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ నేతలపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు చేసిన మేలును, కూటమిప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని కోరారు. పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు.

ప్రభుత్వాన్ని నిలదీద్దాం రండి
కురబలకోట : వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు బుధవారం రాయచోటి కలెక్టరేట్ వద్ద జరిగే యువత పోరు నిరసన కార్యక్రమంలో విశేష సంఖ్యలో విద్యార్థులు, నిరుద్యోగులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. కురబలకోటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీలను విస్మరించిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదలలో జాప్యం జరుగుతోందన్నారు. జనవరిలో ఇస్తామన్న జాబ్ క్యాలెండర్ రాలేదన్నారు. నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. డీఎస్సీపై చంద్రబాబు తొలి సంతకం ఆభాసుపాలైందన్నారు. యువత పోరుతో కూటమి ప్రభుత్వ కళ్లు తెరిపించాలన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

మదనపల్లె : పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఉదయం 8 గంటలకు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా..మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలందరితో కలిసి పార్టీ జెండా ఆవిష్కరణ చేస్తామన్నారు. అనంతరం ఉదయం 10 గంటలకు అన్నమయ్యజిల్లా కేంద్రం రాయచోటిలో జరిగే యువత పోరు కార్యక్రమంలో పాల్గొంటామన్నారు. కార్యక్రమాలకు పెద్దసంఖ్యలో వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి దత్తక్రియ యోగా సాధన తరగతులు

మదనపల్లె సిటీ : స్థానిక విద్యానగర్‌లో బుధవారం దత్తక్రియా యోగా సాధన ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరగతులు 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రముఖ యోగశిక్షకులు వెంకట కామేశ్వరరావు, శివప్రకాష్‌లచే నిర్వహించే ఉచిత తరగతులను ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన 'పది' పరీక్ష పత్రాలు

రామసముద్రం : పదో తరగతికి చెందిన పరీక్ష పత్రాలు మంగళవారం రామసముద్రం పోలీస్ స్టేషన్‌కు చేరాయి. ఈ నెల 17నుంచి 31వ తేదీ వరకు పదవతరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు హెచ్ఎం చిట్టిబాబు తెలిపారు. ఈ మేరకు సెట్–1,2 పరీక్ష పత్రాలు పోలీస్‌స్టేషలో భద్రపరిచినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఏడు పాఠశాలకు సంబంధించి మొత్తం 510 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు.

పీలేరులో ప్రభుత్వ వైద్యసేవలు భేష్


మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

పీలేరురూరల్ : పీలేరు ఏరియా ప్రభుత్వాస్పత్రి వైద్య సేవలు బాగున్నాయని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, రాయచోటి ప్రభుత్వాస్పత్రి మత్తు విభాగం వైద్యనిపుణులు వెంకటశివ అన్నారు. మంగళశారం పీలేరు ఏరియా ఆస్పత్రి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఆస్పత్రి సేవలు ఏడు విభాగాలుగా విభజించి పని తీరును పరిశీలించి నివేదించారు. వైద్యసేవలు అందించడంలో పీలేరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ ప్రథమ బహుమతి, డాక్టర్ వెంకటశివ ద్వితీయ బహుమతి పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ వైద్యసేవలు అందించడంలో ఆస్పత్రి సిబ్బంది అన్ని విభాగాల్లో చురుగ్గా పని చేస్తున్నారని అభినందించారు. అనంతరం వైద్య సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ సరస్వతి, సిబ్బంది భాస్కర్, అమ్మాజీ, లావణ్య, జ్యోతి, రేష్మ, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీలను నియమించాలి

బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు


మాట్లాడుతున్న బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు

మదనపల్లె : ఎస్సీ,ఎస్టీ కేసుల సత్వర పరిష్కారం కోసం జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసుల మేరకు రాష్ట్రంలోని పోలీస్ వ్యవస్థలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎస్సీ ,ఎస్టీసెల్ డీఎస్పీలను ఎన్నికలకు ముందు తొలగించారని, వారిని తిరిగి నియమించాలని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బహుజన సేన ముఖ్య కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బహు జనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ చందు మాట్లాడుతూ రాష్ట్రంలో 2014లో ఎస్సీ ఎస్టీ కేసుల సత్వర పరిష్కారం కోసం జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసులను గౌరవిస్తూ ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని బలపరిచే విధంగా పోలీసు వ్యవస్థలో ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ సెల్ ను ఏర్పాటు చేసి ప్రత్యేక డీఎస్పీలను నియమించారన్నారు. ఈ ప్రత్యేక ఎస్సీ ,ఎస్టీ సెల్ డీఎస్పీల ద్వారా బాధితులకు విచారణ సమయంలో రక్షణ, ముద్దాయిలను అరెస్టు చూపడం , చార్జిషీట్ దాఖలు చేయడం, ఎస్సీ ,ఎస్టీ బాధితులకు సత్వర న్యాయం లభించడం వంటి సహేతుకమైన కార్యాచరణ జరుగుతూ బాధిత వర్గాలకు ఎంతగానో అండగా ఉపయోగపడిందన్నారు. ఈ నేపథ్యంలో 2024లో ఎన్నికలకు ముందు.. 98 మంది ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీలను రద్దు చేసి, ఎస్సీ ,ఎస్టీ బాధిత వర్గాలకు తీరని అన్యాయం చేశారన్నారు. ఈ విషయమై.. మార్చి 24న రాష్ట్ర రాజధాని విజయవాడ ధర్నా చౌక్‌లో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బహుజనసేన వ్యవస్థాపక నాయకులు జయశంకర్, శ్రీరాములు, లక్ష్మీనారాయణ,రాఘవేంద్ర యాదవ్, దిగువ కమ్మపల్లి హరి, బురుజు శివశంకర్, లారా, నూర్ ఆలాం, రూపక్ నాయక్, మేరీ, లక్ష్మీ, రవణమ్మ, నవీన్,భానుప్రకాష్ రెడ్డి, జెన్నిత్, షాలేం,తదితరులు పాల్గొన్నారు.

సంఘమిత్రను కొనసాగించాలని ధర్నా



దర్నా చేస్తున్న మహిళలు, నాయకులు

బి.కొత్తకోట : మండలంలోని బడికాయలపల్లి గ్రామం –4 సంఘమిత్ర భారతీని తొలగించారని నిరసన వ్యక్తం చేస్తూ మంగళవారం వెలుగు మండల సమాఖ్య కార్యాలయం ఎదుట సంఘ సభ్యులు, ఏఐటీయూసీ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యాలయం ఎదుట బైఠాయించి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. 2011లో సంఘమిత్రగా సభ్యులు ఎన్నుకున్నారని, గత ఏపీఎం భారతీ పేరును ఆన్‌లైన్ నుంచి తొలగించారని ఆరోపించారు. ఇప్పుడు భార తీ సంఘమిత్ర కాదని అంటున్నారని, దీనిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సహాయ ప్రధాన కార్యదర్శి సలీంబాషా డిమాండ చేశారు. దీనిపై చర్యలు తీసుకుని న్యాయం చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏపీఎం రాజేశ్వరీకి వినతిపత్రం అందించారు.

సుభాష్‌రెడ్డి సేవలు మరుపురానివి

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


సుభాష్ రెడ్డి అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట : కురబలకోట మండల రాజకీయాల్లో ప్రజాప్రతినిధిగా, నాయకుడిగా సుదీర్ఘ కాలం పాటు ఎల్. సుభాష్ రెడ్డి విశిష్ట సేవలు అందించారని, ఆయనలేని లోటు తీరనిదని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మండలంలోని జంగావారిపల్లె వద్ద రేగడ వ్యవసాయ క్షేత్రంలో సుభాష్ రెడ్డి దహన సంస్కారాలు మంగళవారం నిర్వహించారు. అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పాల్గొని ఘన నివాళులు అర్పించారు. సుభాష్ రెడ్డి కుమారుడు సందీప్‌రెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సుభాష్ రెడ్డి పార్టీలకు అతీతంగా సేవలు అందించారన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం


సారా నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజలు

పీలేరురూరల్ / కేవీపల్లె : సారా రహిత గ్రామాలుగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ప్రజల్లో చైతన్యం నింపుతున్నట్లు పీలేరు, కేవీపల్లె తహసీల్దార్లు ఎం. భీమేశ్వర్ రావు, బి. నరేంద్రకుమార్, ఎక్సైజ్ సీఐ వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా పీలేరు మండలం గూడరేవుపల్లె పంచాయతీ రామానాయక్ తాండా, ఆవులయ్యగారిపల్లె తాండా, కేవీపల్లె మండలం దిగువగల్లతాండాలో నాటు సారా నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటుసారాకు బానిసై కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయన్నారు. ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతారని పేర్కొన్నారు. సారా తయారీ, విక్రయాలకు దూరంగా మంచిమార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లోకేష్, ఎక్సైజ్ ఎస్ఐ చైతన్య, వీఆర్వో హేమంత్‌నాయక్ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బాలికలు ఆత్మస్థైర్యంతో రాణించాలి


ఆత్మరక్షణపై శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులు

పీలేరు : బాలికలు ఆత్మస్థైర్యంతో రాణించాలని స్థానిక జెడ్పీ మెయిన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేంద్రనాథరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ మెయిన్ ఉన్నత పాఠశాలలో ఝాన్సీలక్ష్మీ రక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థినులకు రాష్ట్ర ప్రభుత్వం కరాటే మాస్టర్లచే శిక్షణ కార్యక్రమం ఇస్తోందని, ఇది బాలకల పట్లవరంలాంటిదని పేర్కొన్నారు. స్థానికంగా కరాటే మాస్టర్ దామోదర్ బాలికల ఆత్మరక్షణ కోసం ఇచ్చిన రక్షణ నైపుణ్యాలు చక్కగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కరాటే కోచ్ త్రివేణి, ఉపాధ్యాయులు ఫ్యారూఖాన్, రవీంద్రనాథరెడ్డి, జయపాల్ రెడ్డి, రెడ్డెప్ప, జయరామ్, భాస్కర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర లింగార్చన


పార్థివ లింగంకు అభిషేకం చేస్తున్న భక్తులు

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం చిప్పిలిలోని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో సత్యదేవ సదన్ ప్రారంభోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో సహస్ర లింగార్చన నిర్వహించారు. ఆలయంలో ఉదయం సంకల్పం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్చన, వేదస్వస్తి, మహామంగళహారతి ఇచ్చారు. స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. ఆలయంలో పార్థివ లింగంను ప్రతిష్ఠించారు. భక్తుల స్వహస్తములతో అభిషేకాలు చేశారు. సత్యదేవ సదన్ కార్యక్రమంలో భాగంగా ఆలయంను రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బుధవారం పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధీశులు అభిన వోద్దండ విద్యాశంకర భారతీ స్వామిచే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అమర్‌నాథ్, రామకృష్ణ, దివాకర్,శివశంకర్‌లు తెలిపారు. స్వామిచే అనుగ్రహభాషణం జరుగుతుందన్నారు. స్వామి ఆశీర్వాదం,తీర్థప్రసాదాలు విని యోగం జరుగుతుందన్నారు.